క్లుప్తంగా

రైతు సంఘం నుంచి నిమ్మగడ్డ బహిష్కరణ

ఏలూరు (టూటౌన్): రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉంటూ.. సంఘాన్ని విచ్ఛిన్నం చేసే చర్యలకు పాల్పడిన నిమ్మగడ్డ నర్సింహాను ఏపీ రైతు సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్టు సంఘం జిల్లా కమిటీ సమావేశం ప్రకటించింది. స్థానిక పవరుపేటలోని అన్నే భవనంలో జిల్లా కమిటీ సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. నాయకులు కోర్స జలపాలు, సిరిబత్తుల సీతారామయ్య, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, కోనా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

ఏలూరు (టూటౌన్): విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సీపీఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో స్థానిక వవరుపేట రైల్వే స్టేషన్ నుంచి ఆర్ఆర్‌పేట మెయిన్‌రోడ్డులో మంగళవారం విరాళాలు సేకరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, రాష్ట్ర సమితి సభ్యుడు బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబి, ఏలూరు సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ విరాళం రూ.25 లక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ రూ.25 లక్షల విరాళం ప్రకటించారు. ఈ మేరకు చెక్కును సీఎం చంద్రబాబు నాయుడుని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలిసి అందజేశారని, నగరంలోని ఎంపీ క్యాంపు కార్యాలయం ప్రతినిధులు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. అనంతరం విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు.

అన్నదాతలను ఆదుకోవాలి

ఏలూరు రూరల్ : భారీ వర్షాలు, కొల్లేరు వరద కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి కె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన జాలిపూడిలో ముంపుబారిన పడిన పంటచేలను పరిశీలించారు. వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట చేలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అధికారులు పంట నష్టాలను నమోదు చేసిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. కౌలురైతుల పేర్లతో నష్టాన్ని నమోదు చేయాలన్నారు. పంట ఏ దశలో ఉన్నా అన్ని పంటలకు బీమా పరిహారం, నష్ట పరిహారం అందించాలని కోరారు.

బకాయి జీతాలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): గ్రామ, వార్డు సచివాలయాల వలంటీర్ల మూడు నెలల జీతాలు వెంటనే ఇవ్వాలని ఏలూరు నగర వార్డు వలంటీర్స్ సమావేశం డిమాండ్ చేసింది. ఏలూరు నగర వార్డు వలంటీర్ల సమావేశం వవరుపేటలోని సీఐటీయూ కార్యాలయంలో కుశాల్, మూర్తిల అధ్యక్షతన మంగళవారం ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు టీడీపీ వార్డు వలంటీర్ల వేతనం రూ.10 వేలకు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. నేడు అందుకు భిన్నంగా గతంలో ఇచ్చే నెలకు రూ.5వేల వేతనాలు కూడా మూడు నెలలుగా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక మంది నిరుద్యోగులు, మహిళలు వార్డు వలంటీర్లు ఇచ్చే వేతనాలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వలంటీర్ల వేతన బకాయిలు చెల్లించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వార్డు వలంటీర్ల వేతన బకాయిల కోసం ఈ నెల 17న కలెక్టరేట్ వద్ద సామూహిక రాయబారాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో రమాదేవి, రంగవల్లి, బుచ్చిబాబు, మౌనిక, శ్రావణి, అంబిక, జ్యోతి పాల్గొన్నారు.

కుంగిన మెయిన్ రోడ్డు

దెందులూరు: పోతునూరు - గుండుగొలను వెళ్లే దారిలో అట్టల ఫ్యాక్టరీ వద్ద రోడ్డులో కొంత భాగం కుంగిపోయింది. ఈ ప్రాంతం పక్కన డ్రెయినేజీ ఉండటంతో రోజురోజుకూ కోత భాగం అధికమవుతోందని ప్రయాణీకులు తెలిపారు. ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించి రక్షణ చర్యలు చేపట్టాలని దెందులూరు, గుండుగొలను ప్రజలు కోరారు.

నిమజ్జనాల్లో అప్రమత్తత అవసరం

- విద్యుత్ తీగలను గమనించాలి
- ఏర్పాట్లు చేసిన చోటే నిమజ్జనం మేలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నియోజకవర్గంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు ప్రారంభించిన అనంతరం మూడు, ఐదు, ఏడు, తొమ్మిదో రోజుల్లో గణపతి ప్రతిమలను నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. మూడో రోజు సోమవారం కొన్ని ప్రాంతాల్లో గణనాథులను వేడుకగా నిమజ్జనానికి తరలించారు. ఈ సంబరం ఆనందంగా ఎటువంటి ఇబ్బంది లేకుండా జరిగింది. నిమజ్జనాల సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవిస్తున్నట్టు వస్తున్న వార్తల నేపథ్యంలో అప్రమత్తత ఒకటే ప్రమాదాల నివారణ అని అధికారులు చెబుతున్నారు.

200కు పైగా మండపాలు

ఏలూరు నగరంతో పాటు నియోజకవర్గంలో 200కు పైగా మండపాల్లో గణనాథులు కొలువుదీరారు. అత్యధికంగా ఏలూరు నగరంలోనే దాదాపు ప్రతి వీధిలో పోటాపోటీగా గణపతి మండపాలను ఏర్పాటు చేశారు. కాగా చిన్న పరిమాణంలో ఉన్న ప్రతిమలు వందల్లోనే ఉన్నాయి. ఇళ్లలో ఏర్పాటు చేసిన గణపతులను శని, ఆదివారాల్లోనే నిమజ్జనం చేశారు. నగరంలోని తూర్పు లాకులు, పడమర లాకులు, వసంతమహల్ సెంటర్, ఎన్టీఆర్ కాలనీ, రామకృష్ణాపురం, పాత బస్టాండు, ఆశ్రం కళాశాల ప్రాంతాల్లో కృష్ణా, గోదావరి కాలువల్లో నిమజ్జనానికి అనుకూలంగా రేవులు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో నిమజ్జనానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే కృష్ణా కాలువ ప్రవహించే కొన్ని ప్రాంతాల్లో కూడా నిమజ్జనాలు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో లోతు ఎక్కువగా ఉండడంతో అధికారులు ఆ ప్రాంతాల్లో నిమజ్జనాలు చేయవద్దని హెచ్చరిస్తున్నారు.



నగరంలోని శంకర మఠం వద్ద మండపంలో పూజలు అందుకుంటున్న గణనాథుడు

జాగ్రత్తలు ఇలా..

- ప్రస్తుతం వర్షాల నేపథ్యంలో మండపాల్లో విద్యుత్ ప్రమాదాలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలి.
- ఎత్తైన విగ్రహాలను నిమజ్జనానికి తరలించే సమయంలో డీజే బాక్సులు, వాహనాలపై ఎక్కి నిల్చొవద్దు. మార్గం మధ్యలో వేలాడే విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉంటుంది.
- రహదారుల్లో వ్యతిరేక మార్గంలో ఊరేగించడం, ఎక్కువ మంది రోడ్డు మధ్యలో నడవడం చేస్తే వాహన ప్రమాదాలకు గురి కావచ్చు.
- గణేష్ మండపాల వద్ద నిమజ్జనం వరకూ వంతుల వారీగా నిర్వాహకులు పర్యవేక్షించాలి. మద్యం మత్తులో వేడుకల్లో పాల్గొనడం, నిమజ్జన సమయంలో నీటిలోకి దిగి ప్రాణాలమీదికి తెచ్చుకోవడం సరికాదు.

పటిష్ట ఏర్పాట్లు



గణపతి మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటికే నిర్వాహకులకు పలు సూచనలు చేశాం. లోతు తెలియకుండా విగ్రహాలను నిమజ్జనం చేయడానికి నీటిలోకి దిగరాదు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నాం. అధికారికంగా ఏర్పాటు చేసిన చోటులోనే నిమజ్జనం చేస్తే తగిన రక్షణ లభిస్తుంది. ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని ముందుకు వెళుతున్నాం. భారీ ప్రతిమలను నిమజ్జనం చేయడానికి క్రేన్లు ఏర్పాటు చేశాం. నిమజ్జన ప్రాంతాల్లో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశాం.

– డి.శ్రావణ్ కుమార్, ఏలూరు డీఎస్పీ

సహాయక చర్యల్లో ఘోర వైఫల్యం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జయప్రకాష్

ఏలూరు టౌన్: రాష్ట్రంలో తుఫానులు, వరదల బీభత్సానికి జనజీవనం అతలాకుతలమైంది. విజయవాడ బుడమేరు విలయం సృష్టించటంతో లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. బుడమేరు వరదపై ప్రజలను అప్రమత్తం చేయటంలో, బాధితులకు సహాయక చర్యల్లో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ ఆరోపించారు. ఏలూరులో ఆయన మాట్లాడారు.

మ్యాన్‌మేడ్ ఫ్లడ్స్ నిజమని తేలింది

విజయవాడ బుడమేరు వరద ముంపుపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిందే నిజమని స్పష్టమైంది. సాక్షాత్తు రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ తమకు వరద తీవ్రతపై ముందుగానే సమాచారం ఉందని, కానీ రెండు లక్షలకు పైగా కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించటం సాధ్యం కాదని చెప్పటం ప్రభుత్వ చేతగానితనాన్ని బయటపెట్టింది. ఇరిగేషన్ అధికారులు ఒక రోజు ముందుగానే హెచ్చరించినా పట్టించుకోకపోవటం బాధాకరమని, ప్రజలను కావాలనే వరద ముంపుకు బలిచేయటం కూటమి ప్రభుత్వ నీచమైన పాలనకు నిదర్శనం.

చిత్తశుద్ధి లేదు

బుడమేరు వరద సహాయక చర్యల్లో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. మీడియాలో ప్రచార ఆర్భాటాలు తప్ప నిజంగా ప్రజలకు చేసిందేమీ లేదు. సుమారు ఆరు లక్షల మంది ప్రజలు వరదలతో నిరాశ్రయులు అయ్యారు. కట్టుబట్టలతో ఇళ్లు వదిలి బయటకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వేలాదిమంది ఊర్లు వెళ్లిపోయారు. వరదల్లో చిక్కుకున్న బాధితులకు కనీసం తాగునీరు, ఆహారం అందించలేని కూటమి ప్రభుత్వం ప్రతిపక్షాలను విమర్శించటం సిగ్గుచేటు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పర్యవేక్షించినా అధికార యంత్రాంగం పనిచేయలేదని చెప్పుకోవటం వారి డొల్లతనాన్ని బయటపెడుతుంది.



కూటమి ప్రభుత్వం వైఫల్యమే

వరద బాధితులకు నేటికీ పూర్తిస్థాయిలో సహాయం అందకపోవటం ప్రభుత్వ వైఫల్యాన్ని తేటతెల్లం చేస్తోంది. వదర ముంపు బాధితులకు మూడు రోజుల వరకు తాగేందుకు నీటిని కూడా ప్రభుత్వం అందించలేకపోయింది. వారికి నష్ట పరిహారం ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి ఉంది. కేంద్రంతో మాట్లాడి వెంటనే బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలి. పేదలు, ఇళ్లు, సర్వస్వం కోల్పోయిన వారిని పూర్తిస్థాయిలో ఆదుకోవాలి. వైఎస్సార్ సీపీ ప్రజల పక్షాన నిలబడి అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త జయప్రకాష్ తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఎనీమియా రాకుండా ఉండాలంటే అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఏలూరు ప్రాజెక్టు సీడీపీఓ ఎ.పద్మావతి కోరారు. స్థానిక పవరుపేట యూపీహెచ్‌సీలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే రాగిపిండి, అటుకులు, బెల్లం, ఖర్జూరం, చిక్కీలు తినడం ద్వారా గర్భిణులు, బాలింతలు ఎనీమియాను దూరం పెట్టవచ్చని అన్నారు. డాక్టర్ గౌతమ్‌రాజ్ మాట్లాడుతూ ప్రతి నెలా 9, 10 తేదీల్లో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం మౌనిక, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

పోషకాహార లోపాన్ని తగ్గించవచ్చు

మంచి ఆహారంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించవచ్చునని డాక్టర్ బి.బాలకృష్ణ అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పోషకాహారం తినడం ద్వారా ఎనీమియా రాకుండా చూడవచ్చునని సీడీపీఓ ఎ.పద్మావతి అన్నారు. ఏలూరు ప్రాజెక్టు 3వ నెంబరు గజ్జెలవారి చెరువు యూహెచ్‌సీలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ మీనాక్షి, అంగన్‌డీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

రైతు సంఘాల రాస్తారోకో

ఏలూరు (టూటౌన్): విశాఖపట్టణం స్టీల్ ప్లాంట్ పట్ల కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని నిరసిస్తూ కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ వద్ద మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాలి, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలి, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలంటూ నినదించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు డీఎన్‌వీడీ ప్రసాద్, కె.బుచ్చిబాబు, బద్దా వెంకట్రావులు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజల మద్దతుతో కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడంతో ప్రభుత్వం వెనుకడుగు వేసిందని తెలిపారు. మోదీ ప్రభుత్వం పథకం ప్రకారమే స్టీల్ ప్లాంట్‌ను నష్టాలోకి నెడుతుందని ఆరోపించారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్టీల్ ప్లాంట్‌ని సందర్శించిన కేంద్ర మంత్రి కుమార స్వామి, సహాయ మంత్రి శ్రీనివాస వర్మ దేశంలోనే అత్యుత్తమ స్టీల్ ప్లాంట్ విశాఖ అని కొనియాడారని తెలిపారు. టీడీపీ మద్దతుతో కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వాన్ని చంద్రబాబు నాయుడు స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కనీసం ప్రయత్నించడం లేదని ఆరోపించారు. తక్షణం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు డేగా ప్రభాకర్, కె.శ్రీనివాస్, కార్మిక సంఘాల నాయకులు బండి వెంకటేశ్వరరావు, రాజనాల రామ్మోహనరావు, రెడ్డి శ్రీనివాస డాంగే, ఎం కృష్ణ చైతన్య, కె.కృష్ణమాచార్యులు, వై.శ్రీనివాసరావు, ఎం అప్పారావు, పి.గంగరాజు, బి.సోమయ్య, జి.రవికిషోర్, కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పాతబస్టాండ్ వద్ద రాస్తారోకో చేస్తున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

67 మందికి ఉద్యోగావకాశాలు

భీమడోలు: భీమడోలు వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 67 మంది ఉద్యోగావకాశాలు పొందారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బాబ్‌మేళాకు మండల వ్యాప్తంగా 119 మంది నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వివిధ కార్పొరేట్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన 67 మందిని ఎంపిక చేసుకున్నారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్ తెలిపారు. వారికి నియామక పత్రాలను అందించారు. ఈ జాబ్ మేళాలో ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్, స్కిల్ హబ్ ఇంచార్జి జంగం రాము, జిల్లా ఉద్యోగ కల్పనాధికారి ప్రవీణ్, కోఆర్డినేటర్లు సురేష్, సత్యనారాయణ, దుర్గాభవానీ పాల్గొన్నారు.

చేపలను కాపాడుకునేందుకు అగచాట్లు


ఏలూరు రూరల్ : కొల్లేరును ముంచిన వరద నీరు చేపల చెరువుల యజమానులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. చెరువుల్లో కోట్ల రూపాయల మత్స్య సంపద కాపాడుకునేందుకు యజమానులు నానా అగచాట్లు పడుతున్నారు. వరద తాకిడికి చేపలు కొల్లేరులోనికి కొట్టుకుపోకుండా చెరువుల చుట్టూ వలలు కట్టుకుంటున్నారు. ఇలా ఒకటి కాదు రెండు కాదు వందలాది ఎకరాల చెరువులకు వలలు కడుతున్నారు.

లక్షల్లో ఖర్చు

చెరువుల్లో చేపల కొట్టుకుపోకుండా కాపాడుకోవడం యజమానులకు తలకు మించిన భారంగా మారింది. ఇందుకోసం లక్షల రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని వాపోతున్నారు. పెదయాగనమిల్లిలో ఓ సాగుదారుడు 100 ఎకరాల చెరువు చుట్టూ వల కట్టేందుకు రూ.2 లక్షలు ఖర్చు చేశారు. పదుల సంఖ్యలో కూలీలను రప్పించారు. వరద ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువు చుట్టూ వల కట్టించారు. ఇందుకోసం కూలీలకు మరో రూ.30 వేలు ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇలా ఏలూరు రూరల్ మండలం కొల్లేరు గ్రామాల్లో వందల ఎకరాల్లో యజమానులు చెరువులు చుట్టూ వలలు కట్టారు. అయినప్పటికీ కొన్నిప్రాంతాల్లో వల ఎత్తుకు అడుగు దూరంలో వరద ప్రవహిస్తోంది. వరద మరింత పెరుగుతుందన్న భయంతో పలువురు యజమానులు లక్షల రూపాయలు ఖర్చు పెట్టలేక చేతులు ఎత్తేశారు.

భక్తి శ్రద్ధలతో గణపతి మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ ప్రాంతాల్లో గణపతి నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. స్వామి వారికి విశేష పూజలు, హోమాలు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్వామి వారి భారీ ప్రతిమలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సత్రంపాడు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం వద్ద మంగళవారం స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. రమా మహల్ సెంటర్‌లో గణపతి ప్రతిమకు కరెన్సీ నోట్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. కాగా సోమవారం మూడో రోజున నిమజ్జనం చేసిన గణపతి పందిళ్లలో మంగళవారం ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని మహాన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదాలు స్వీకరించారు.



ఆదివారపుపేటలో వినాయక విగ్రహం



అశోక్‌నగర్ గణేష్



విజయవిహార్ సెంటరులో నృత్య గణపతి



రమామహల్ సెంటరులో కరెన్సీ వినాయక



ఎన్ఆర్‌పేటలో లంబోదరుడు

జీవో 85 తక్షణమే రద్దు చేయాలి



పూళ్లలో నల్లబ్యాడ్జీలను ధరించి వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారిణి కల్యాణీమహేశ్వరి

భీమడోలు: వైద్యుల పాలిట గుదిబండగా మారిన జీవో 85ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ భీమడోలు మండలంలోని పీహెచ్‌సీలు, సామాజిక వైద్యులు మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలను ధరించి వైద్యులు రోగులకు వైద్య సేవలందించారు. పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీసు కోటాను 30శాతం నుంచి 15శాతానికి కుదిస్తూ ప్రభుత్వం జీవో 85ను జారీ చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ రెండు నెలలుగా పీహెచ్‌సీ వైద్యులు సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా వారి విజ్ఞప్తిని ఖాతరు చేయకపోవడంతో వైద్యుల సంఘం ఆందోళన బాట పట్టింది. ఈ నేపథ్యంలో పూళ్ల, గుండుగొలనులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సామాజిక ఆరోగ్య కేంద్రంలో పలువురు వైద్యులు ఆందోళన కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారులు ఈ.కల్యాణీమహేశ్వరి, అరుణజ్యోతి, శ్రీలక్ష్మీ తదితరులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. రోగులకు వైద్య సేవలందించారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని వారన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	36
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు - తిరుపతి	16.00	4830	10

వరద నష్టాన్ని పారదర్శకంగా నమోదు చేయాలి

భీమడోలు: వరద నష్టం అంచనాలను క్షేత్రస్థాయి అధికారులు పారదర్శకంగా నమోదు చేయాలని ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో మంగళవారం వరద నష్టం అంచనాల తయారీ చేసే అంశాలపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద నష్టాలను అంచనాలు వేసేందుకు ప్రభుత్వం 20 అంశాలతో కూడిన ప్రత్యేక ఫార్మేట్‌ను రూపొందించిందని, దీనిలో గ్రామాలు, విభాగాల వారీగా వరద నష్టం అంచనాలను నమోదు చేయాలని కోరారు. ఇదే క్రమంలో వరద తగ్గుముఖం పట్టిన తర్వాత పారిశుధ్య పరిరక్షణ చర్యలను ఆ గ్రామాల్లో ముమ్మరంగా చేపట్టాలని, తాగునీటి నాణ్యత పరీక్షలు చేసి తదనుగుణంగా శుద్ధి చేసిన నీటిని ప్రజలక సరఫరా చేయాలన్నారు. తరుణంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యాధి బాధితుల గుర్తింపు సర్వే చేయాలన్నారు. వర్షాలకు తడిసి ఇండ్లు నష్టపోయిన బాధితుల వివరాలను సేకరించాలన్నారు. నష్టపరిహారం ఇచ్చేందుకు తగు నివేదికలు సిద్ధం అందజేయాలన్నారు. ఆగడాలలంకలో పశుగ్రాసం కొరత ఉందని గుర్తించామని, ఐదు రోజులకు సరిపడా పశువులు, మేకలు, ఇతర జీవులకు పశుదాణా పంపిణీ చేసేందుకు తగు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ పద్మావతి, తహసీల్దార్ బి.రమాదేవి, ఏవో ఉషారాణి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాన్ని పరిశీలించిన ఎంపీడీఓ

దెందులూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు కొల్లేరు వరదబారిన పడకుండా లోతట్టు ప్రాంతమైన మాధవరం గ్రామాన్ని మంగళవారం దెందులూరు ఎంపీడీఓ వి.శ్రీలత పరిశీలించారు. వరదకు అవకాశం ఉన్న 10 ఇళ్లను, రోడ్లను స్వయంగా ఎంపీడీ పరిశీలించారు. స్థానికుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. రక్షణ చర్యగా పది కుటుంబాలు కమ్యూనిటీ హాలు, పాఠశాలలో ఉంటే మంచిదని సూచించారు. తాగునీరు, విద్యుత్, ఆహారం, ఇతర కనీస అవసరాలపై సమీక్షించారు. వీఆర్వో, గ్రామ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, గ్రామంలో సమాచారం తనకు, తహసీల్దార్‌కు తెలియజేయాలన్నారు. రాత్రివేళల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామ కార్యదర్శి షరీఫ్, వీఆర్వో శ్రీను, సచివాలయ ఉద్యోగులు, గ్రామ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.